

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 11-01-2026 | సంపుటి - 26 | సంచిక -235 | రూ : 4 | పేజీలు: 8



నారా భువనేశ్వరికి

## మరో విశిష్ట పురస్కారం..

- నారా భువనేశ్వరికి 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్' అవార్డు
- మహిళా సాధికారతకు చేస్తున్న సేవలకు ప్రశంసలు
- భువనేశ్వరి కృషి స్ఫూర్తిదాయకమన్న సీఎం చంద్రబాబు
- ఈ గౌరవం పాడి రైతులకే చెందుతుందన్న భువనేశ్వరి


2లో

మియాపూర్ లో రూ.3 వేల కోట్లకు పైగా

## విలువైన భూమికి హైడ్రా రక్షణ

- మియాపూర్‌లో రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం
- సర్వే నంబర్ 44లో 15 ఎకరాలకు పైగా భూమిని కాపాడిన హైడ్రా
- తప్పుడు పత్రాలతో కబ్జాకు యత్నించినట్లు అధికారుల నిర్ధారణ
- ఆక్రమణల తొలగింపు.. భూమి చుట్టూ ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు
- కబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

2లో





2లో

అయోధ్యలో కఠిన నిబంధనలు..

## నాన్-వెజ్ ఫుడ్ డెలివరీపై నిషేధం

- అయోధ్య రామ మందిరం పరిధిలో నాన్-వెజ్ ఫుడ్ డెలివరీపై నిషేధం
- ఆలయానికి 15 కిలోమీటర్ల పరిధిలో ఆన్‌లైన్ డెలివరీపై ఆంక్షలు
- పంచకోశీ పరిక్రమ మార్గంలో ఫిర్యాదులు రావడంతో అధికారుల నిర్ణయం
- హోటళ్లలో మాంసాహారం, మద్యం అమ్మకాలపై కూడా తీవ్ర హెచ్చరికలు


శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్..

## పనుల తీరుపై మంత్రి నారా లోకేశ్ స్పందన

- శ్రీసిటీలో రూ.5,000 కోట్లతో ఎల్జీ భారీ ప్లాంట్ ఏర్పాటు
- పనులు శరవేగంగా సాగుతున్నాయంటూ మంత్రి లోకేశ్ ట్వీట్
- భారత్‌లో ఎల్జీకి ఇది మూడో తయారీ యూనిట్
- 2026 చివరికల్లా ఉత్పత్తి ప్రారంభం, వేల మందికి ఉద్యోగాలు
- శ్రీసిటీ ఎల్జీ ప్లాంట్ లో ఫ్రిజ్ లు ఏసీలు, వాషింగ్ మెషీన్ల తయారీ

2లో





2లో

ఒడిశాలో కూలిపోయిన

## చార్టర్డ్ విమానం

- రూర్కెలా నుండి భువనేశ్వర్‌కు వెళుతున్న చార్టర్డ్ విమానం
- పైలట్ సహా ఏడుగురు ప్రయాణికులు ఉండగా కూలిన చార్టర్డ్
- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు

జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే

## ఇలాంటి ప్రచారం చేయరు



2లో

- మీడియాతో సీఎం చంద్రబాబు చిట్ చాట్
- జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే నదులపై దుష్ప్రచారం చేయరని వ్యాఖ్యలు
- రెండు తెలుగు రాష్ట్రాలు నీటి కోసం గొడవ పడొద్దన్న చంద్రబాబు
- పట్టిసీమతోనే రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి చెందిందని వెల్లడి
- గత ప్రభుత్వం రూ.900 కోట్ల బిల్లులు చేసుకుందని ఆరోపణ
- రాజధానిపై వైసీపీ ఇంకా విషం చిమ్ముతోందని విమర్శ

## నేను సామాజిక వైద్యుడిని..

### ప్రజారోగ్య సంరక్షణకు అమిత ప్రాధాన్యమిస్తున్నా



- ఫెలోస్ ఇండియా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి
- రోగుల నాడి పట్టడం మరవొద్దని వైద్యులకు సూచన

హైదరాబాద్: 'నేను వైద్యుడిని కాదు. కానీ, సోషల్ డాక్టర్‌ని. సామాజిక రోగాలపై మాట్లాడతా. మీరంతా సమాజాన్ని ప్రభావితం చేసే ప్రత్యేక వర్గం. మీరు మా ప్రాణాలను కాపాడతారని మేమంతా బలంగా నమ్ముతాం. ఈ క్రమంలో మనుషులపై, సమాజంపై

తరువాయి 2లో

# జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే ఇలాంటి ప్రచారం చేయరు: సీఎం చంద్రబాబు

అమరావతి: మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే నదుల గురించి ఇలా దుష్ప్రచారం చేయరని, అసలు సింధు నాగరికత ఎలా ఏర్పడిందో తెలుసుకుంటే మంచిదని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ప్రపంచ ప్రఖ్యాత నగరాలైన దేశ రాజధాని దిల్లీ, లండన్ వంటివన్నీ నదీ తీరాల వెంబడే అభివృద్ధి చెందాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నదీ గర్భం, నదీ పరివాహక ప్రాంతంకు కనీస తేడా తెలియకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమకు బుద్ధి చెప్పినా రాజధాని విషయంలో ఇప్పటికీ విషం చిమ్మడం మానలేదని విమర్శించారు. శనివారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన చంద్రబాబు, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. నీటి విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య గొడవలు పడితే అంతిమంగా నష్టపోయేది తెలుగు ప్రజలేనని చంద్రబాబు స్పష్టం చేశారు. “రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుంది? తెలంగాణతో కలిసి సహకరించుకుని మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయి” అని సూచించారు. నీటిని సమర్థవంతంగా వాడుకోవడం వల్లే రాయలసీమ స్వరూపం మారిందని, పట్టిసీమ ప్రాజెక్టు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు ఫలితంగానే రాయలసీమలో ఉద్యాన విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, ప్రస్తుతం దేశంలోనే ఉద్యాన (హార్టికల్చర్) రంగంలో ఏపీ మొదటి స్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కేవలం స్వార్థ రాజకీయాల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఆపేసిందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. 2020లో కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్ల బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో నీటి విషయంలో రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత అనేదే లేకుండా చూసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

## నారా భువనేశ్వరికి
# మరో విశిష్ట పురస్కారం...

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా భువనేశ్వరిపై ప్రశంసలు కురిపించారు. ఆమెకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాడి రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత కోసం భువనేశ్వరి చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పురస్కారం ఆమెకు, ఆమె బృందానికి దక్కాల్సిన సరైన గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ గౌరవం వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతుల కృషి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ (సౌత్ జోన్) నారా భువనేశ్వరికి ‘అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్’ అవార్డును ప్రకటించింది. డెయిరీ రంగంలో ఆమె అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డు అందుకోవడంపై భువనేశ్వరి స్పందించారు. తనకు ఈ గౌరవాన్ని అందించిన ఇండియన్ డెయిరీ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. భారత డెయిరీ రంగం అభివృద్ధి, శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని ఆమె మరోసారి స్పష్టం చేశారు.

## మియాపూర్ లో రూ.3 వేల కోట్లకు పైగా
# విలువైన భూమికి హైడ్రా రక్షణ

మియాపూర్: రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. శేరిలింగంపల్లి మండలం, మక్తా మహబూబ్‌పేటలోని సర్వే నంబర్ 44లో ఉన్న సుమారు రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి కబ్జాకు గురవుతోందని గతంలోనే హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు గతంలోనే ఐదు ఎకరాలను స్వాధీనం చేసుకుని, చెరువు కట్టపై నిర్మించిన 18 అక్రమ షెట్టర్లను తొలగించారు. అయితే, ఇదే భూమికి సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు గురయ్యారనే వార్తల నేపథ్యంలో హైడ్రా అధికారులు మరోసారి విచారణ చేపట్టారు. ఈ విచారణలో, సర్వే నంబర్ 159కి చెందిన పత్రాలను ఉపయోగించి సర్వే నంబర్ 44లోని మొత్తం 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఎకరంన్నర భూమిని కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తాజాగా పూర్తిస్థాయిలో రంగంలోకి దిగిన హైడ్రా, ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేసింది.

# ఒడిశాలో కూలిపోయిన చార్టర్డ్ విమానం

ఒడిశా: ఒడిశాలో చార్టర్డ్ విమానం కూలిపోయింది. రూర్కెలా నుంచి భువనేశ్వర్‌కు ప్రయాణిస్తున్న తొమ్మిది సీట్ల విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికి ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటన జరిగిన సమయంలో విమానంలో పైలట్‌తో సహా మొత్తం ఏడుగురు వ్యక్తులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులకూ గాయాలు కాగా, వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సుందర్‌గఢ్ జిల్లాలోని కన్సార్ ప్రాంతంలో ఈ చార్టర్డ్ విమానం కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా నిర్ధారణ కాలేదు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# టికెట్ ధరలు అడ్డగోలుగా పెంచితే కఠిన చర్యలు..

అమరావతి: సంక్రాంతి పండుగ రద్దీని ఆసరాగా తీసుకుని ప్రయాణికులను నిలువు దోపిడీ చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులను ఏపీ రవాణా శాఖ హెచ్చరించింది. టికెట్ ధరల పెంపు విషయంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించవద్దని, ఆర్టీసీ ఛార్జీలకన్నా 50 శాతం గరిష్ఠంగా పెంచుకోవచ్చని తెలిపింది. అంతకుమించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా పేర్కొన్నారు. ధరల పెంపునకు సంబంధించి నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. ఈ నెల 18 వరకు అన్ని జిల్లాల్లో నిత్యం తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభి బస్, రెడ్ బస్ వంటి యాప్‌ల ద్వారా కూడా ఆయా ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు ఎంత టికెట్ ధరలు వసూలు చేస్తున్నాయో పర్యవేక్షిస్తున్నామని, అధిక ధరలు ఉంటే కేసులు పెడతామని చెప్పారు. అధిక ధరలు వసూలు చేస్తే ప్రయాణికులు ఫిర్యాదు చేసేందుకు హెల్ప్‌లైన్ నంబరు 9281607001ను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెంబర్ ను అన్ని బస్సుల్లో డిస్ ప్లే చేసేలా ట్రావెల్స్ యజమానులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు.

# శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్... పనుల తీరుపై మంత్రి నారా లోకేశ్ స్పందన

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ (LG) ఏర్పాటు చేస్తున్న భారీ తయారీ ప్లాంట్ పనులు శరవేగంగా సాగుతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రూ.5,000 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పురోగతిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు, యువతకు ఉద్యోగ కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందని చెప్పడానికి ఈ ప్రాజెక్టే నిదర్శనమని పేర్కొన్నారు. 247 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రపంచ స్థాయి తయారీ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. గత ఏడాది మే 2025లో ఈ ప్రాజెక్టుకు భూమిని అప్పగించగా, అతి తక్కువ సమయంలోనే నిర్మాణ పనుల్లో గణనీయమైన పురోగతి సాధించడంపై లోకేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. భారత్‌లో ఎల్జీ ఏర్పాటు చేస్తున్న మూడో ప్లాంట్ ఇది. ఈ యూనిట్‌లో రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లతో పాటు కీలకమైన విడిభాగాలను కూడా ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో తయారీ రంగ పర్యావరణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రణాళిక ప్రకారం 2026 చివరి నాటికి ఈ ప్లాంట్‌లో ఉత్పత్తిని ప్రారంభించి, 2029 వరకు దశలవారీగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# అయోధ్యలో కఠిన నిబంధనలు.. నాన్‌వెజ్ ఫుడ్ డెలివరీపై నిషేధం

అయోధ్య: రామ మందిరానికి 15 కిలోమీటర్ల పరిధిలో మాంసాహార (నాన్ వెజ్) పదార్థాల ఆన్‌లైన్ డెలివరీని అయోధ్య యంత్రాంగం నిషేధించింది. ఈ మేరకు తాజాగా కఠినమైన ఉత్తర్వులు జారీ చేసింది. పవిత్ర పుణ్యక్షేత్రంగా భావించే ‘పంచకోశి పరిక్రమ’ పరిధిలోని ప్రాంతాల్లోకి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు మాంసాహారాన్ని సరఫరా చేస్తున్నాయని పదేపదే ఫిర్యాదులు రావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయోధ్యలోని కొన్ని హోటళ్లు, హోమ్‌స్టేలు అతిథులకు మాంసాహారంతో పాటు మద్యం కూడా అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని వాటి యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశామని అధికారులు తెలిపారు. నిషేధం ఉన్నప్పటికీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పర్యాటకులకు నాన్‌వెజ్ ఫుడ్ అందుతోందని ఫిర్యాదులు వచ్చినట్లు అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ మాణిక్ చంద్ర సింగ్ ధ్రువీకరించారు. “ఈ ఫిర్యాదుల నేపథ్యంలోనే ఆన్‌లైన్ నాన్‌వెజ్ ఫుడ్ డెలివరీపై నిషేధం విధించాం. హోటళ్లు, దుకాణదారులు, డెలివరీ కంపెనీలన్నింటికీ సమాచారం ఇచ్చాం. నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉంటుంది” అని ఆయన స్పష్టం చేశారు. అయోధ్య, ఫైజాబాద్‌లను కలిపే 14 కిలోమీటర్ల రామ్ పథ్ మార్గంలో మద్యం, మాంసం అమ్మకాలను నిషేధిస్తూ 2025 మే నెలలో అయోధ్య మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకుంది. మాంసం దుకాణాలను తొలగించినప్పటికీ, మద్యం అమ్మకాలపై నిషేధం మాత్రం తొమ్మిది నెలలుగా సరిగా అమలు కావడం లేదని, ఈ మార్గంలో రెండు డజన్లకు పైగా మద్యం దుకాణాలు ఇంకా నడుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అయితే, మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలంటే జిల్లా యంత్రాంగం అనుమతి తప్పనిసరి అని ఓ మున్సిపల్ అధికారి పేర్కొన్నారు.

# మాటలతో వినకపోతే బలప్రయోగమే..

అమెరికా, జనవరి 10: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్కిటిక్ ప్రాంతంలోని గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు బలప్రయోగానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. డెన్మార్క్‌కు చెందిన ఈ స్వయంప్రతిపత్తి గల ద్వీపంపై ఆ దేశ సార్వభౌమత్వాన్ని ఆయన తోసిపుచ్చారు. నిన్న వైట్‌హౌస్‌లో చమురు సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. “డెన్మార్క్‌కు నచ్చినా నచ్చకపోయినా, గ్రీన్‌ల్యాండ్ విషయంలో మేం ఏదో ఒకటి చేయబోతున్నాం. సులభమైన మార్గంలో ఒప్పందం చేసుకోవడానికే నేను ఇష్టపడతాను. కానీ, ఆ మార్గంలో పని జరగకపోతే, కఠినమైన మార్గాన్ని ఎంచుకుంటాం” అని ట్రంప్ హెచ్చరించారు. ఆర్కిటిక్‌లో రష్యా, చైనాల సైనిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని, అమెరికా జాతీయ భద్రతకు గ్రీన్‌ల్యాండ్‌ను నియంత్రించడం చాలా కీలకమని ఆయన అన్నారు. “మనం ఏమీ చేయకపోతే రష్యా లేదా చైనా గ్రీన్‌ల్యాండ్‌ను ఆక్రమిస్తాయి. దానిని మేం జరగనివ్వం. అందుకే మంచిమాటలతో లేదా మరో కఠిన మార్గంలోనో గ్రీన్‌ల్యాండ్‌తో ఏదో ఒకటి చేస్తాం” అని ట్రంప్ వివరించారు.

## సీఎం చంద్రబాబును కలిసిన
# ప్రకృతి వైద్య నిపుణుడు మంతెన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రకృతి వైద్య సలహాదారుగా ఇటీవల నియమితులైన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు శనివారం నాడు సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసిన ఆయన, తనకు సలహాదారుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంతెన సత్యనారాయణ రాజుకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి వైద్య రంగంలో డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుకున్న అనుభవాన్ని వినియోగించుకోవాలని భావించిన ప్రభుత్వం, ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వానికి



ప్రకృతి వైద్య సలహాదారుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ డిసెంబర్ 29న అధికారికంగా ఉత్తర్వులు (జీవో) జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, డాక్టర్ రాజు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యానికి సంబంధించిన విధానాలపై ప్రభుత్వానికి డాక్టర్ రాజు సలహాలు, సూచనలు అందించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి సిద్ధమైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై విస్తృతంగా ప్రచారం చేస్తూ మంతెన సత్యనారాయణ రాజు విశేష ప్రజాదరణ పొందారు. ఆయన అమరావతి సమీపంలో ‘మంతెన ఆరోగ్యాలయం’ పేరుతో ప్రకృతి చికిత్సాలయం, పరిశోధన కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# నేను సామాజిక వైద్యుడిని..

హైదరాబాద్: ‘నేను వైద్యుడిని కాదు. కానీ, సోషల్ డాక్టర్‌ని. సామాజిక రోగాలపై మాట్లాడతా. మీరంతా సమాజాన్ని ప్రభావితం చేసే ప్రత్యేక వర్గం. మీరు మా ప్రాణాలను కాపాడతారని మేమంతా బలంగా నమ్ముతాం. ఈ క్రమంలో మనుషులపై, సమాజంపై మీ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దు'' అని వైద్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.

హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫెడరేషన్(ఐసీఆర్‌టీఎఫ్), మెడికవర్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఫెలోస్ ఇండియా 2026 సదస్సులో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ‘‘ప్రజల ఆరోగ్య సంరక్షణకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. వైద్యారోగ్య రంగాల అభివృద్ధికి ఉత్తమ పాలసీల కోసం వైద్యులతో కలిసి పనిచేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్‌కేర్ ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచమంతా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వైపు వేగంగా పరుగులు తీస్తోంది. మీరు కూడా అధునాతన సాంకేతికతను సొంతం చేసుకోవాలి. అదే సమయంలో రోగుల నాడిని పట్టుకోవడం విస్మరించొద్దు. ప్రస్తుతం గుండె జబ్బులు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టేందుకు మనమందరం కలిసి కృషి చేయాలి. విద్యార్థులకు సీపీఆర్ నేర్పించేందుకు వైద్యులు స్వచ్ఛందంగా ముందుకొస్తే ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చు. ఇలాంటి సదస్సులు హైదరాబాద్‌లో జరగడం నాకెంతో గర్వంగా ఉంది. మీరంతా విజయవంతమైన కార్డియాలజిస్టులు. అయినా ఎప్పటికప్పుడు మీ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి ఇలాంటి సదస్సులు బాగా ఉపయోగపడతాయి. నిరంతరం నేర్చుకోవడమే అతిపెద్ద విజయ రహస్యం. కొత్త విషయాలను తెలుసుకోవడం, నైపుణ్యాన్ని పెంచుకోవడం మానేస్తే కెరీర్‌కు ముగింపు పలికినట్లే’ అని సీఎం స్పష్టంచేశారు. ఈ సదస్సులో భాగంగా క్లిష్టమైన కరోనరీ యాంజియోప్లాస్టీలు, ఆధునిక వాల్యులర్ ప్రొసీజర్లు, కొత్త వైద్య పరికరాలు, భవిష్యత్ కార్డియాలజీపై వైద్యులు ప్రత్యేక చర్చ నిర్వహించారు. సదస్సులో మెడికవర్ సీఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణ, ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.ప్రతాప్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఐఏఎస్‌పై వార్తలు..
# ఖండించిన ఐపీఎస్‌ల సంఘం

హైదరాబాద్: ఓ మహిళా ఐఏఎస్‌పై వచ్చిన వార్తలను ఐపీఎస్‌ల సంఘం ఖండించింది. కొన్ని మీడియా సంస్థలు ప్రసారం చేసిన వార్తలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నిజాయతీగా పనిచేస్తున్న అధికారుల విషయంలో ఇలాంటి వ్యాఖ్యలు తగవని పేర్కొంది. దురుద్దేశంతో మహిళా ఐఏఎస్‌ను కించపరిచారని.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఐపీఎస్‌ల సంఘం స్పష్టం చేసింది. తప్పుడు వార్తలను అన్ని మాధ్యమాల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది.




# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులిస్తాం

*** తప్పుడు ప్రచారం నమ్మొద్దు**
*** సమాచార శాఖ మంత్రి పొంగులేటి**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు భారీగా తగ్గిస్తున్నట్లు వస్తున్న వదంతుల్లో ఎలాంటి వాస్తవం లేదని, అయితే ఎంతో గౌరవప్రదమైన అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేస్తున్న వారి ఆగడాలకు మాత్రం ఖచ్చితంగా బ్రేక్ వేసి, అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు అందించేలా పగడ్బందీ చర్యలు చేపడతామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. శనివారం నాడు సచివాలయంలోని తన ఛాంబర్ లో, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక, ముఖ్యమంత్రి చీఫ్ పిఆర్ఓ మల్సూర్ లతో కలిసి నిర్వహించిన జర్నలిస్టు సంఘాల ప్రధాన బాధ్యుల సమావేశంలో మాట్లాడారు. 252 జీవో లో కొన్ని లోటు పాట్లపై జర్నలిస్టు సంఘాలు చేస్తున్న సూచనలను పరిగణలోకి తీసుకొని వాటిని సరిచేసేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, గతంలో డెస్క్ జర్నలిస్టులందరికీ కాకుండా, కొందరికే న్యాయం జరిగేదని, ప్రస్తుతం అలా కాకుండా, బస్ పాస్ లతో సహా ప్రభుత్వం కల్పించే ప్రతి సంక్షేమ పథకం రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులనే తేడా లేకుండా, ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి డెస్క్ జర్నలిస్టుకు వర్తింపజేసేలా జీవో లో స్పష్టత ఇవ్వాలని కోరారు. కేబుల్ టీవీ ఛానెల్స్ కు సంబంధించి, జీవో లో నెలకొన్న అస్పష్టతను తొలగించాలని విజ్ఞప్తి చేసారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు మండలానికి ఒకటి కాకుండా, ప్రధాన డేట్ లైన్ లను గుర్తించి, వాటి ప్రకారం అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. చిన్న పత్రికలకు గ్రేడింగ్ ఆధారంగా జిల్లాల్లో కూడా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. ప్రధాన పత్రికలు, శాటిలైట్ న్యూస్ ఛానెల్స్ కు కార్డుల కుదింపు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు, వీడియో జర్నలిస్టులకు, కెమెరా జర్నలిస్టులకు వారి కార్యాలయాల సిఫారసుల మేరకు అందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చెయ్యాలన్నారు. రాష్ట్రంలో ఉర్దూ అధికార భాషా కనక, ఇతర భాషల సర్క్యూలేషన్ లతో, గ్రేడింగ్ లతో వాటిని పోల్చకుండా, ఉర్దూ పత్రికలు సర్క్యూలేట్ అవుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక కేటగిరి క్రింద జిల్లా, మండల స్థాయిల్లో ఉర్దూ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేలా జీవో లో పొందుపర్చాలని కోరారు. వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులు పొందడానికి, జీవో లో పేర్కొన్న వృత్తి అనుభవాన్ని కొంత తగ్గిస్తూ సవరించాలని విరాహత్ అలీ కోరారు. టీ యూ డబ్ ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ, అక్రెడిటేషన్ కార్డులకు ప్రభుత్వం కోత పెడుతుందని జర్నలిస్టుల్లో జరుగుతున్న చర్చకు ఇవాల్టి సమావేశం ఫుల్ స్టాప్ పెడుతుందన్నారు. అక్రెడిటేషన్ కార్డులతో పాటు జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఆరోగ్య పథకం, ఇళ్ల స్థలాలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. ఇంకా ఈ సమాశంలో టీయుడబ్ల్యూజేఐజేయు అనుబంధ సంస్థలైన చిన్న,మధ్య తరగతి పత్రికల సంఘం బాధ్యులు యూసుఫ్ బాబు, అశోక్, ఫోటో జర్నలిస్టుల సంఘం బాద్యులు గంగాధర్, కె.ఎన్.హరి, వీడియో జర్నలిస్టుల సంఘం బాధ్యులు నాగరాజు, హరి, ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ బాద్యుడు గౌస్ మోహియుద్దీన్, మహిళా జర్నలిస్ట్స్ విభాగం బాద్యురాలు వాకాటి మంజుల లతో పాటు ఆయా ప్రధాన జర్నలిస్టు సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.





## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ వెంకట్ సాయి ఎంక్లేవ్ నందు నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయాన్ని శనివారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ సందర్శించి లక్ష్మీ గణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం వెంకట సాయి హోమ్స్ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకట సాయి హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి నరసింహారావు, కాలనీవాసులు రా ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, మూర్తి, రమేష్, హనుమంత్ రెడ్డి, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కొంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు పెద్దిరెడ్డి సుజాత, రాఘవేంద్రరావు, రవి కిరణ్, జ్యోతి నర్సింహా రెడ్డి, కోలన్ మీనా సునీల్ రెడ్డి, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబశివరెడ్డి, మల్లేష్,ముత్యాలు, జస్వంత్, ప్రవీణ్, విద్య సాగర్, ఎండి.సలీం, స్వామి, సతీష్ రెడ్డి, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించేందుకు ఫుడ్ ఫెస్టివల్

*** వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులకు విద్యతో పాటు ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించేందుకు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలు దోహదపడుతాయని వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ అన్నారు. శనివారం షాపూర్నగర్ లోని వైష్ణవి ఒలంపియాడ్ స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన తో పాటు అధ్యక్షులు వరప్రసాద్, అకాడమి డైరెక్టర్ , ప్రిన్సిపాల్ సాయిబాబా లు ముఖ్య అతిథులుగా హజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు ఆహార పదార్థాలను తిలకించి రూచి చూసి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు ఫుడ్ ఫెస్టివల్ ఉపయోగపడుతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల యజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షునిగా తాళ్ల విజయ్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఉప సర్పంచ్‌ల ఫోరం ముస్తాబాద్ మండల అధ్యక్షునిగా తాళ్ల విజయ్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముస్తాబాద్ మండలంలో శనివారం ఉప సర్పంచ్ ఫోరం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ తాళ్ల విజయ్ రెడ్డి ఏకగ్రీవం అయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కోల కృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులుగా పల్లె ఆనంద్, మార్కంటి వినోద్‌తోపాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. అధ్యక్షునిగా ఎన్నికైన తాళ్ల విజయ్ రెడ్డి ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి ముందుండి కృషి చేస్తానని, తనను ఎన్నుకున్న ఉప సర్పంచ్‌లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం

**: జనసేన**

హైదరాబాద్: రాబోయే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే ప్రారంభించినట్లు ఆ పార్టీ వెల్లడించింది. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నప్పటికీ సాధ్యమైనన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొంది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న జనసైనికులు, వీర మహిళలు ఈ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని జనసేన పార్టీ పిలుపు నిచ్చింది.



## చెరువులతోనే జీవ మనుగడ సాధ్యం

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : చెరువులతోనే జీవ మనుగడ సాధ్యమని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. శనివారం జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి సాయి బృందావనం ఎస్టేట్స్ కాలనీ నందు గల ఆచార్య కుంట లేక్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ కాకతీయ ద్వారా భూగర్భ జలాలు పెంపొందడంతో పాటు సమీప కాలనీ వాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందజేయవచ్చన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణ అందించడమే మా ప్రథమ కర్తవ్యమని అన్నారు. చెరువు ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స డీజిఎం చంద్రమోహన్, ఏఈ ప్రవీణ్, సాయి బృందావనం ఎస్టేట్స్ అసోసియేషన్ సభ్యులు, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు పెద్దిరెడ్డి సుజాత,రాఘవేంద్రరావు, రవి కిరణ్,జ్యోతి నర్సింహా రెడ్డి, కోలన్ మీనా సునీల్ రెడ్డి, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబశివరెడ్డి, మల్లేష్,ముత్యాలు, జస్వంత్, ప్రవీణ్, బొబ్బ శ్రీనివాస్,విద్య సాగర్, సలీం, స్వామి, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళల్లో దాగి ఉన్న ప్రతిభ ను వెలికి తీసేందుకు సంక్రాంతి ముగ్గులు దోహదం

*** మేడ్చల్ జిల్లా ట్రస్మా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : మహిళల్లో దాగి ఉన్న ప్రతిభ ను వెలికి తీసేందుకు సంక్రాంతి ముగ్గులు దోహదపడతాయని మేడ్చల్ జిల్లా ట్రస్మా ప్రధాన కార్యదర్శి,శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల కర స్పాండెంట్,ఛైర్మెన్ బిర్రు ఆంజనేయులు అన్నారు. మకర సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి,మగ్దుమ్ నగర్ భగత్ సింగ్ మార్గ్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన "సంక్రాంతి రంగేళి ముగ్గుల పోటీల"కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తెలుగు సంస్కృతీ, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని,ప్రపంచ దేశాలు సైతం మన కట్టుబాట్ల ను ఎంతో గౌరవిస్తున్నారన్నారు. ప్రతి పండుగ విశిష్టత తెలియజేసేలా నిర్వహిస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నామన్నారు..మహిళలు వంటింటికే పరిమితం కాకుండా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ ముగ్గుల పోటీలలో మొత్తం 42 మంది విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన బహుమతు లను ఈనెల 26న గణతంత్ర దినోత్సవం రోజున అందజేస్తామని ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బిర్రు శోభారాణి,ఉపాధ్యాయులు ప్రశాంతి,అన్నే ఫాతిమా, ప్రసన్న, సరళ, కృష్ణవేణి, మహేశ్వరి, సాజిత, సుభాషిని,విద్యార్థుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## పేద, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడే పార్టీ సీపీఐ

- **సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు**
- **సిపిఐ శత జయంతి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పేద, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడే పార్టీ సీపీఐ అని పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామంలో సిపిఐ శత జయంతి ఉత్సవాల కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 11న ముస్తాబాద్ మేజర్ పంచాయతీ ఆఫీసు నుంచి రైతు వేదిక వరకు ఊరేగింపు, అనంతరం సిపిఐ జెండా ఆవిష్కరణ, తదనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు పోతుగల్ బస్టాండ్ ఆవరణలో సిపిఐ శతజయంతి ఉత్సవాల బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సభకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కేకే మహేందర్ రెడ్డి, పోతుగల్ గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నరసయ్య, సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ హాజరవుతారని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అనవేని భూదన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, జిల్లా నాయకుడు ప్రణయ్, సిపిఐ జిల్లా నాయకులు ఎలగందుల నరేందర్, రాయమ్ వెంకటేష్, గుణవేణి కనకయ్య, గొడుగు భద్రయ్య, షేర్ల ప్రశాంత్, జియాంగిటి కిషన్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## ఆ సిరప్ వాడకం నిలిపివేయాలి

**: తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్**



హైదరాబాద్: ఆల్మంట్ కిడ్ సిరప్ వినియోగాన్ని నిలిపివేయాలని తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశించింది. సిరప్‌లో ఇథలీన్ గ్లైకాల్ కలుషితమై విషపూరితమైనట్లు గుర్తించారు. ఈ మేరకు కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి హెచ్చరిక అందింది. ఇది ఎవరివద్దనైనా ఉంటే.. వాడకం, విక్రయాలు నిలిపివేయాలని సూచించింది. దీంతో తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరిక నోటీసు జారీ చేసింది. పిల్లలకు వాడే సిరప్ కావడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# రామవరంలో కాంగ్రెస్ శంఖారావం


* **కార్పొరేషన్ ఎన్నికలకు కౌంట్‌డౌన్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రానున్న కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల జెండా ఎగురవేయాలని ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రామవరం 14వ డివిజన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంటా గోపయ్య నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని, నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని సూచించారు. ప్రజల మెప్పు పొందేలా నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను తప్పకుండా గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొత్తగూడెం వ్యాప్తంగా అన్ని డివిజన్లలో సన్నాహక సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ కార్యకర్తలను సమర్థవంతంగా దిశానిర్దేశం చేయాలని నాయకులకు సూచించారు. ప్రజాపాలనలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను ప్రజల వరకు తీసుకెళ్లాలని అన్నారు.ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెరుగైన ఫలితాలు సాధించడంలో కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. అదే ఉత్సాహంతో రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కాంగ్రెస్ పార్టీ వశం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సీనియర్ నాయకుడు గంటా గోపయ్య గారిని ఎంపీ రఘురామిరెడ్డి శాలువాతో సత్కరించారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్న, ఆళ్ళ మురళి, నాగేంద్ర త్రివేది, శ్రీనివాస్ రెడ్డి,ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్, అర్జున్ రావు, బోయినపల్లి సురేష్, హరి సింగ్, నారాయణ, గౌస్, జానీ మియా,మట్టపర్తి రమేష్, జావేద్, మస్తాన్,పురుషోత్తం, నరసింహ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్బిఐ ప్రమాద బీమా క్లెయిమ్ సెటిల్

* **నామినీ కుటుంబానికి రూ.40 లక్షల చెక్కు అందజేత**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎస్బిఐ బ్యాంకు అందిస్తున్న ప్రమాద బీమా సేవలు అనేక కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్నాయి. కొత్తగూడెం ఏరియా సింగభూపాలెం బ్రాంచ్‌కు చెందిన ఖాతాదారు, లేట్ ధారావత్ రమేష్ ప్రమాదంలో మృతి చెందగా, ఆయన నామినీ కుటుంబానికి సంబంధించిన రూ.40 లక్షల ప్రమాద బీమా క్లెయిమ్‌ను ఎస్బిఐ విజయవంతంగా సెటిల్ చేసింది.క్రొత్తగూడెం రీజినల్ ఆఫీస్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో డీజీఎం ఘన్‌శ్యామ్ సోలంకి, రీజినల్ మేనేజర్ మిద్దెల సత్యనారాయణ, చీఫ్ మేనేజర్ ప్రభాత్ రంజన్ నాయక్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.40 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ, అనుకోని ప్రమాదాల సమయంలో బీమా కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తుందని తెలిపారు. ప్రతి వ్యక్తి తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. చెక్కు స్వీకరించిన కుటుంబ సభ్యులు క్లెయిమ్ ప్రక్రియలో పూర్తి సహకారం అందించిన ఎస్బిఐ అధికారులకు, బ్రాంచ్ మేనేజర్, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టకాలంలో ఎస్బిఐ అందించిన సహాయం మరచిపోలేనిదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సింగభూపాలెం బ్రాంచ్ మేనేజర్ కే. బాలగోపాల్‌తో పాటు ఎస్బిఐ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కలిసిన మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని అల్లాపురం తాజా మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి శనివారం హైదరాబాదులో కలిశారు. పూల బొకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి మహిపాల్ రెడ్డి, వరకాంతం రవీందర్ రెడ్డి, ముత్యాల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం పురోభివృద్ధి

* **మేడ్చల్ మల్కాజ్గిరి ఎసీపీ కడారి వెంకట్ రెడ్డి**
* **చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో రంగోళి ముగ్గుల పోటీలు**




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం పురోభివృద్ధి సాధిస్తుందని మేడ్చల్ మల్కాజ్గిరి ఎసీపీ కడారి వెంకట్ రెడ్డి అన్నారు. మకర సంక్రాంతి పర్వదినోత్సవం పురస్కరించుకుని శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దుంనగర్ లోని చైతన్య విద్యా నికేతన్ హై స్కూల్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా పాఠశాలలో భోగిపండ్లను చిన్నారులకు పోసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజ్గిరి ఎసీపీ కడారి వెంకట్ రెడ్డి, జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ , కూకట్ పల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే బి.సంజీవ రావు, మాజీ కౌన్సిలర్ జి.వరమ్మ, చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ డా.చందన మద్రిపల్లి, ఫైర్ సెఫ్టి ఆఫీసర్ చక్రవర్తి, లు పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో గెలుపు ఓటములు సహజమని అన్నారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. మహిళలు, విద్యార్థుల్లోని ప్రతిభ, సృజనాత్మక వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు ప్రథమ బహుమతి టీ.జ్యోతి రూ.3000, ద్వితీయ బహుమతి వి.స్వాతి రూ.2000, తృతీయ బహుమతి ప్రసన్న లకు రూ.1000 నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్, ఛైర్మన్ రాష్ట్ర ప్రెసిడెంట్ ట్రస్మా(ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్)డాక్టర్ శివరాత్రి యాదగిరి, డైరెక్టర్ మంగ దేవి, ప్రిన్సిపాల్ శివరాత్రి సాయితేజ,స్థానిక నాయకులు యాదగిరి, కుమార్ యాదవ్, రాజు, మోజేస్, ఇన్చార్జి ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లులు తదితరులు పాల్గొన్నారు.









# కాలనీలోని పార్కు తో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : కాలనీలోని పార్కు తో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులను ఆదేశించారు.శనివారం జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి “సిరి ఎంక్లేవ్” నందు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని కమ్యూనిటీ హాల్, పార్కు అభివృద్ధితో పాటు కాలనీకి అనుకోని ఉన్న ఖాళీ స్థలంలో జరుగుతున్న అక్రమ డంపింగ్ పై కాలనీ వాసులు ఎమ్మెల్యే కి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఖాళీ స్థలంలో అక్రమ చెత్త డంపింగ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమంగా చెత్త డంపింగ్ కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిరి ఎంక్లేవ్ అధ్యక్షులు ఆనంద్, ఉపాధ్యక్షులు రవి, జనరల్ సెక్రటరీ మధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విఘ్నేష్ రెడ్డి, ట్రెజరర్ ప్రతీక్, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు పెద్దిరెడ్డి సుజాత,రాఘవేంద్రరావు, రవి కిరణ్,జ్యోతి నర్సింహా రెడ్డి, కోలన్ మీనా సునీల్ రెడ్డి, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు బిక్షపతి, సాంబశివరెడ్డి, మల్లేష్, ముత్యాలు, జస్వంత్, ప్రవీణ్, బొబ్బ శ్రీనివాస్, సతీష్ రెడ్డి, విద్య సాగర్, ఎండి.సలీం, స్వామి,యువ నాయకులు ఆనంద్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న.. అరవిందో విద్యార్థుల రంగవల్లులు

* **ముగ్గుతో రైతులకు కృతజ్ఞత:**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చుక్కలను భువి మీదకు దింపి వాటిని అందమైన రంగులతో ఆకట్టుకునేలా చేసే కళాత్మకత అమ్మాయిల సొంతం అని నిరూపించుకున్నారం అరవిందో జూనియర్, నలంద డిగ్రీ విద్యార్థులు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం అరవింద జూనియర్, నలంద డిగ్రీ కళాశాలల ఆవరణలో శనివారం విద్యార్థినీలు సంక్రాంతి ముగ్గులను అందంగా వేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా అందమైన ముగ్గులను వేశారు. ఈ ముగ్గులలో ప్రపంచానికి అన్నం పెట్టే రైతు దంపతులను ముగ్గు రూపంలో వేసి రైతులకు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ వల్లమల రాజశేఖర్, చిలువేరు దుర్గయ్య, అధ్యాపకులు కట్టెల లింగస్వామి, నాగలక్ష్మి, రాములు, కళ్యాణి, శ్రీదేవి, మహేష్, బాలరాజు విద్యార్థినీలు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి

* **వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్**











జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : తెలుగు ప్రజల సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి అని మహిళల్లోని ప్రతిభను వెలికి తీయడానికి రంగురంగుల ముగ్గుల పోటీలు దోహదపడతాయని వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ అన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్ పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పాఠశాల ప్రాంగణం ఒక పల్లెటూరి వాతావరణాన్ని తలపించింది. విద్యార్థుల హరిదాసు,డూ..డూ బసవన్న వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.రంగురంగుల ముగ్గులు,గాలిపటాల సందడితో పాఠశాల అంతా కోలాహలంగా మారింది. ఉపాధ్యాయులు,విద్యార్థులు కలిసి సంక్రాంతి పాటలకు ముత్యాలు చేస్తూ అలరించారు.ఈ వేడుకలలో వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల అవరణలో చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థుల తల్లులుచే ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. సంక్రాంతి పండుగకు ఎంతో విశిష్టత ఉందని మూడు రోజులపాటు కుటుంబ సభ్యులు సన్నిహితులతో కలిసి ఎంతో ఉత్సాహంగా ఈ పండుగను చేసుకుంటారన్నారు.తమ విద్యార్థులకు ప్రతి పండుగ విశిష్టతను తెలియజేసేలా పాఠశాలలో పండుగలకు సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రథమ,ద్వితీయ, తృతీయ,ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు తదితరులు పాల్గొన్నారు



# విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

*** జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**

*** శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా"ఫుడ్ ఫెస్ట్ "వేడుకలు.**






జగద్గిరిగుట్ట, ప్రజాస్పూర్తి : విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూంనగర్ సమీపంలోని భగత్ సింగ్ మార్గ్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఫుడ్ ఫెస్ట్"వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, పాఠశాల కరస్పాండెంట్,చైర్మన్,ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు,ప్రిన్సిపల్ బిర్రు శోభారాణి,పలు పాఠశాలల కరస్పాండెంట్లు హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్,చైర్మన్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు,శాస్త్ర,సాంకేతిక రంగాలలో రాణించే విధంగా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధిస్తున్నామన్నారు.ఈ ఫుడ్ ఫెస్ట్ లో తెలుగు రాష్ట్రాల వంటకాల తో పాటు ఉత్తర భారతీయులు చేసిన వంటకాలు,స్వీట్ లు, అల్పాహార తినుబండారాలు,పలు రకాల పండ్ల జ్యూస్,పిండి వంటకాలు ఎంతో రుచికరంగా ఉన్నాయని అతిధులు విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ ఫుడ్ ఫెస్ట్ లో సుమారుగా 240 రకాల వంటకాలను ప్రదర్శనలో పెట్టారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యుజే(ఐజేయు) జిల్లా అధ్యక్షులు,ట్రస్మా ప్రతినిధులు గడ్డమీది బాలరాజు గౌడ్,చెప్యాల నరసింహులు గౌడ్,స్థానిక నాయకులు పి.విఠల్ ముదిరాజ్, శ్రీధర్ గౌడ్, బ్రహ్మాచారి,డి. సంపత్ రెడ్డి, సునీల్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు ప్రశాంతి, అన్నే ఫాతిమా,ప్రసన్న,సరళ, కృష్ణ వేణి,మహేశ్వరి,సాజిత, సుభాషిని విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

## సంస్కృతి పాఠశాలలో ఘనంగా ముగ్గుల పోటీలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్పూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప లోని సంస్కృతి పాఠశాలలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాల ఆవరణలో ఎంతో ఉత్సాహం గ మహిళలు, వారి తల్లులు పాల్గొన్నారు. చూడచక్కని ముగ్గులు వేసి అబ్బురపరిచారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి ప్రత్యేక బహుమతులను అందించారు. అంతకు ముందు పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ , ప్రిన్సిపాల్ గడ్డమీది బాలరాజుపాల్గొని వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహిళలో దాగి ఉన్న ప్రతిభ బయటపడుతుందన్నారు. తెలుగు సంస్కృతి సంప్రాదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని అన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




కూకట్ పల్లి , ప్రజాస్పూర్తి: కూకట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 37 వసంతాల అందమైన జ్ఞాపకాలు 10 వ తరగతి బ్యాచ్ 1988 89 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూకట్ పల్లి అపూర్వ కలయిక శనివారము ఉదయం నుండి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకట్ రెడ్డి , విజయలక్ష్మి టీచర్ హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో చనిపోయిన ఉపాధ్యాయులకి , మా తోటి స్నేహితులకు రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈరోజు భావి భారత పౌరులే భారతదేశానికి పునాదులు అని చెప్పి మాట్లాడారు విద్యార్థులను క్రమశిక్షణగలో పెట్టడం మా బాధ్యతని తెలియపరిచారు ఆరోజుల్లో మేము మీకు సక్రమమైన మార్గాన్ని నిర్దేశించడం వల్లనే ఈరోజు మీ పిల్లలకు కూడా మీరు మంచి మార్గంలో నడిపించడం జరిగిందని , మేము మిమ్ములను క్రమశిక్షణలో పెట్టాము కావున మీరు మీ పిల్లలకి మంచి భవిష్యత్తును ఇచ్చారని తెలిపారు చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేశారు విజయలక్ష్మి టీచర్ మాట్లాడుతూ 37 సంవత్సరాల తర్వాత నన్ను మళ్ళీ కూకట్ పల్లి జిల్లా పరిషత్ స్కూల్ పిలిచి గుర్తుంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం పూర్వ విద్యార్థులు ఎక్కువగా ఒక్కరొక్కరుగా లేచి పరీయ పరిచయం చేసుకున్నారు పాత జ్ఞాపకాలను నెమరువేస్తూ ఎంతో సంతోషాన్ని తెలియపరిచారు ఇలాంటి కార్యక్రమాలు అనేకం చేసుకోవాలని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమం నందు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నిజాంపేట ఎక్స్ కార్పొరేటర్ కొలను శ్రీనివాస్ రెడ్డి, ఎర్రవెల్లి వాసుదేవరావు, రాజేందర్, శ్రీనివాస్ ,..ఇందిర ,భాను రేఖ, ప్రేమలత, వల్లి, పద్మ, సక్కుబాయి, వెంగళరావు, గోపాలకృష్ణ, జీత్ రాజ్, తదితరులు పాల్గొన్నారు







## చైనా మాంజా... విసురుతోంది పంజా

ప్రజాస్పూర్తి, ముస్తాబాద్: సంక్రాంతి అంటేనే గుర్తుకు వచ్చేది గాలిపటాలు. పండగకు సెలవులు ఇవ్వడంతో చిన్నారులు, యువత పతంగులు ఎగురవేస్తూ ఎంతో సందడి చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో గాలి పటాల పోటీలు సైతం నిర్వహిస్తుంటారు. అయితే గాలిపటాలు ఎగురవేసేందుకు సంప్రదాయ దారాన్ని వినియోగిస్తే పరవా లేదు కానీ కైట్ ఫైటింగ్ (పెంచి కొట్టడం) కోసం దారం బలంగా ఉండాలని కొందరు నిషేధిత చైనా మాంజాలు వినియోగిస్తుంటారు.అయితే ఈ చైనా మాంజా వినియోగం వల్ల పక్షులకు ప్రమాదం పొంచి ఉంది. గాలి పటం ఎగురవేసే సమయంలో ఈ దారం గనుక పక్షులకు తగిలితే వాటి రెక్కలు తెగడం, ఒంటిపై కోసుకుపోవడం వంటివి జరిగి చనిపోయే అవకాశాలున్నాయి. పతంగులు ఎగురవేసే సమయంలో అవి తెగి మాంజాతో సహా చెట్లకు చిక్కు కోవడం, రోడ్డు అడ్డంగా మాంజాతో పతంగులు పడటం ద్వారా ఆ మార్గంలో వెళ్లే ద్విచక్రవాహన చోదకుల మెడకు కోసుకుపోయి ప్రాణాలు సైతం కోల్పోయే ఆస్కారం ఉంది.చైనా మాంజాపై నిషేధం ఉన్నప్పటికీ గుట్టు చాటుగా విక్రయాలు కొనసాగిస్తున్నారు. అయితే చాలా మంది ఈ మాంజాపై అవగాహన లేక వాటితోనే పతంగులు ఎగురవేస్తున్నారు. ఇది ఇలా ఉంటే పెద్దపెద్ద భవనాల పైనుంచి పతంగులు ఎగురవేసేటప్పుడు ఆ భవనానికి పిట్టగోడ ఉండకపోతే గాలి పటాలు ఎగురవేసే సమయంలో పై నుంచి కింద పడిపోయి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు.

*** చైనా మంజా విక్రయించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**

చైనా మంజా విక్రయించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని చైనా మాంజా అమ్మకాలపై తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. చైనా మాంజా వల్ల ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, చిన్నారులు, పక్షలు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారని, గతంలో పలువురు గాయపడిన ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో, ముందస్తు చర్యలలో భాగంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజాను విక్రయించినా, వినియోగించినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి చైనా మంజాను వినియోగించకుండా ఉండాలని, తమ పిల్లలను కూడా దాని నుంచి దూరంగా ఉంచాలని సూచించారు. ఎక్కడైనా చైనా మంజా అమ్మకాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



## రామవరం 15వ డివిజన్లో ఘనంగా ముగ్గుల పోటీలు

*** ఆకునూరి సుప్రియ ఆధ్వర్యంలో నిర్వహణ**



ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గంలోని కార్మిక ప్రాంతమైన రామవరం 15వ డివిజన్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆకునూరి సుప్రియ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో రామవరం మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులతో పరిసరాలను హరివిల్లుల్లా మార్చారు. కొందరు మహిళలు వేసిన ముగ్గులు న్యాయనిర్ణేతలను సైతం అయోమయానికి గురిచేసేంత అద్భుతంగా ఉండటం విశేషం.ఈ సందర్భంగా ఆకునూరి సుప్రియ మాట్లాడుతూ, మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారికి గుర్తింపు కల్పించాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ, రామవరం ప్రజలకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్వర్ణభారతి హై స్కూల్ హెచ్ఎం శైలజ, సిహెచ్ సరోజ, ఎం. రమాదేవి పాల్గొని గెలుపొందిన



వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో పద్మ మొదటి బహుమతి, సాయి సుష్మా రెండో బహుమతి, ప్రసన్న మాధవి మూడో బహుమతి సాధించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గౌస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గడ్డం రాజా శేఖర్, జట్టు మోహన్, దివ్య, హరి సింగ్, గాయత్రీ, పురుషోత్తం, సముద్రాల శ్రీను, రమణ, నిఖిల్, యాకూబ్, కున్నుశ్రవణ్, రవి తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులకు ప్రకృతి దీక్ష వ్యవస్థాపకులు మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్ష సభ్యులు పారుల్, నైనిక రజువా మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా నైనిక రజువా మాట్లాడుతూ, "నేడు మొక్కలు నాటకపోతే రేపు మొక్కలను వీపున పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుంది" అని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆమె స్వయంగా ముగ్గుల పోటీల్లో పాల్గొని 'ప్లాంట్ ఎ ట్రీ... ప్లాంట్ ఎ లైఫ్' అనే సందేశంతో రూపొందించిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా స్వర్ణభారతి హెచ్ఎం శైలజ నైనిక రజువాను ప్రత్యేకంగా అభినందించారు.

## పండుగ శోభను పెంచేవి.. సంక్రాంతి ముగ్గులు

*** గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చౌటుప్పల్ మండల చైర్మన్ వెన్ రెడ్డి సంధ్య రాజు**





చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: తెలుగువారి సాంప్రదాయానికి ప్రత్యేకగా నిలిచేవి.. పండుగ శోభను అమితంగా పెంచేవి సంక్రాంతి ముగ్గులు అని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చౌటుప్పల్ మండల చైర్మన్ వెన్ రెడ్డి సంధ్య రాజు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ విద్యాసంస్థలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఉపాధ్యాయునీలను 20గ్రూపులుగా విభజించి, గ్రూపుకు 11మంది చొప్పున ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చౌటుప్పల్ మండల చైర్మన్ వెన్ రెడ్డి సంధ్య రాజు హాజరయ్యారు. ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెన్ రెడ్డి సంధ్య రాజు మాట్లాడుతూ పండుగ రోజుల్లో ఇళ్ల ముందు వేసే రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలు, పూల అలంకరణలు సిరిసంపదలను, ఆహ్లాదాన్ని సూచిస్తాయన్నారు. ఇవి రైతులకు కొత్త పంట వచ్చిన ఆనందాన్ని, కుటుంబ ఐక్యతను, ప్రకృతికి కృతజ్ఞతను తెలుపుతాయన్నారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి గెలుపొందిన అనూష జట్టు రూ.5,116/లు, ద్వితీయ బహుమతి గెలుపొందిన కే శ్రీదేవి జట్టు రూ.4,116/లు, తృతీయ బహుమతి గెలుపొందిన శ్రీదేవి జట్టు రూ.3,116/ల నగదు బహుమతులను అందజేశారు. అదేవిధంగా ముగ్గుల పోటీలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇలాంటి ఆహ్లాదకరమైన కార్యక్రమాన్ని ముందస్తుగా నిర్వహించిన ట్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపల్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కే వి బి కృష్ణారావులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కేవీపీ కృష్ణారావు, ట్రినిటీ శ్రేయోభిలాషులు కరుణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం దురదృష్టకరం

**: మంత్రి కోమటిరెడ్డి**



హైదరాబాద్: మంత్రులపై ఇటీవల వస్తున్న ఆరోపణల్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఖండించారు. ఓ మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా రాతలు రాయొద్దని మంత్రి హితవు పలికారు. మంత్రి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 'నా జిల్లాలోనే కాదు.. చాలా జిల్లాల్లో కలెక్టర్ల బదిలీ జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే ఈ ప్రక్రియ జరుగుతుంది. అధికారుల మీద అభాండాలు వేయడం సరికాదు. రేటింగ్‌లు, వ్యూస్ కోసం అవాస్తవాలు రాయడం సరికాదు. ఛానళ్ల మధ్య పోటీ కోసం మహిళా అధికారులను ఇబ్బంది పెట్టొద్దు. మంత్రులపైనే కాదు.. సీఎంపైనా దుష్ప్రచారం చేస్తున్నారు' అని కోమటిరెడ్డి అన్నారు.

# వారసత్వాన్ని నాశనం చేసేందుకు నా కుటుంబీకులు చాలు : లాలూ కుమార్తె

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య.. తన కుటుంబ సభ్యులపై మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. తమ వారసత్వాన్ని కొందరు నాశనం చేస్తున్నారని.. ఇందుకు బయట వ్యక్తులు అవసరం లేదన్నారు. కుటుంబ గౌరవాన్ని, ఉనికిని నిలబెట్టిన వారి మూలాలను చెరిపేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆమె.. ఇది తననెంతో షాక్‌కు గురిచేసిందన్నారు. "ఎంతో కృషితో సృష్టించిన గొప్ప వారసత్వాన్ని బయటి



వ్యక్తులు నాశనం చేయాల్సిన అవసరం లేదు. ఇందుకు మా ప్రియమైన వాళ్లే చాలు. ముఖ్యంగా మా సొంత వ్యక్తులు సరిపోతారు" అని రోహిణి ఆచార్య పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఆమె.. ఎవ్వరి పేరు మాత్రం ప్రస్తావించలేదు. అజ్ఞానం అనే ముసుగు ఉన్నప్పుడు.. అహంకారం తలకెక్కుతుందన్నారు. అప్పుడు వినాశక శక్తులు అప్రమత్తమై.. ఓ వ్యక్తి ఆలోచన, నిర్ణయాలను నియంత్రిస్తారంటూ వ్యాఖ్యానించారు. లాలూ తన కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను కుటుంబం నుంచి బహిష్కరించడంపై రోహిణి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ ఘోర పరాజయం పాలైన తర్వాత కీలక వ్యాఖ్యలు చేసిన ఆమె.. రాజకీయాలతోపాటు కుటుంబంతోనూ సంబంధాలను తెంచుకుంటున్నట్లు ప్రకటించారు. ఆ సందర్భంగా తేజస్వీ యాదవ్ సన్నిహితులు, పార్టీ కీలక నేతల పేర్లను కూడా ప్రస్తావించిన విషయం తెలిసిందే.

### జన నాయగన్ వివాదం..
## విజయ్‌కు స్టాలిన్ మద్దతు

సెన్సార్ బోర్డు ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడంతో విజయ్ కథానాయకుడిగా నటించిన 'జన నాయగన్' సినిమా విడుదల వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తమ రాజకీయ లబ్ధి కోసం సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించుకుంటోందన్నారు. తాజాగా ఈ జాబితాలో సెన్సార్ బోర్డు కూడా చేరిందని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సీబీఎఫ్‌సీని కూడా ఆయుధంగా ఉపయోగిస్తోందని.. ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఈ విషయంలో తమిళనాడు కాంగ్రెస్ నేతలు సైతం విజయ్‌కు మద్దతుగా నిలిచారు. తమిళనాడుపై భాజపా తీసుకునే ఏ చర్యనైనా అన్ని పార్టీలు వ్యతిరేకించాలని లోక్‌సభ ఎంపీ జోతిమణి పిలుపునిచ్చారు. కాగా జననాయగన్ సినిమాకు సెన్సార్ క్లియరెన్స్ జారీ చేయడంలో జాప్యం వెనక కేంద్ర ప్రభుత్వం ఉందనే ఆరోపణలను భాజపా తోసిపుచ్చింది. సెన్సార్‌బోర్డు నియమ నిబంధనల ఆధారంగా బోర్డు సభ్యులు సినిమాల విషయంలో నిర్ణయం తీసుకుంటారని.. దీనిని రాజకీయ దృష్టితో చూడాల్సిన అవసరం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ అన్నారు.

## ఆ ఉద్యోగి సహజీవన భాగస్వామికీ పింఛను..
## పరిశీలించాలని కేంద్రానికి కోర్టు ఆదేశం

విశ్రాంత ఉద్యోగి సహజీవన భాగస్వామికీ పింఛను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని దిల్లీ హైకోర్టు ఆదేశించింది. తన సహజీవన భాగస్వామిని, తమ పిల్లలను కూడా కుటుంబ పింఛనులో చేర్చాలంటూ దాఖలైన పిటిషన్ విచారణలో భాగంగా న్యాయస్థానం ఈ ఉత్తర్వులు ఇచ్చింది. పిటిషనర్ 40 ఏళ్లుగా ఒక మహిళతో సహజీవనం చేస్తున్నారు. వారికి సంతానం కూడా కలిగింది. ఈ బంధం ప్రారంభం కావడానికి ముందే అతడు తన భార్య నుంచి విడిగా ఉంటున్నారు. కానీ వారు చట్టబద్ధంగా విడాకులు మాత్రం తీసుకోలేదు. తన భార్య, కుమార్తెను నిర్లక్ష్యం చేస్తూ మరో మహిళతో కలిసి ఉన్నారంటూ 1990లో పిటిషనర్ శాఖాపరమైన దర్యాప్తును ఎదుర్కొన్నారు. దాంతో అతడికి నాలుగేళ్లపాటు జీతంలో కోతపడింది. తర్వాత మరోసారి 2011లో ఇలాంటి క్రమశిక్షణాచర్యలే ఎదురయ్యాయి. తన భాగస్వామి, పిల్లల కోసం దౌత్యపరమైన పాస్‌పోర్టుల విషయంలో తప్పుడు




వివరాలు ఇచ్చారని ఉన్నతాధికారులు నివేదికలో వెల్లడించారు. దాంతో నెలవారీ పెన్షన్‌లో 50 శాతం, గ్రాట్యుటీ ప్రయోజనాల్లో కోతపడింది. పిటిషనర్, ప్రభుత్వ వాదనలను పరిశీలించిన న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. తన భార్య తనతో కలిసి ఉండటం లేదనే విషయాన్ని, మరో మహిళతో సహజీవన బంధాన్ని అతడు దాచిపెట్టినట్టుగా వెల్లడికాలేదని పేర్కొంది. "రికార్డులు స్పష్టంగా ఉన్నాయి. పెన్షన్‌లో కోత పెట్టడంలో ఎలాంటి చట్టబద్ధత కనిపించడం లేదు. తన డిపార్ట్‌మెంట్‌ను మోసం చేయడం ద్వారా పాస్‌పోర్టులను పొందాలనే దురుద్దేశం అతడిలో కనిపించడం లేదు" అని కోర్టు పేర్కొంది. అలాగే పిటిషనర్ తన భాగస్వామి, పిల్లలను కుటుంబ పింఛనులో చేర్చాలంటూ చేసిన అభ్యర్థనను పరిశీలించాలని కేంద్రానికి ఉత్తర్వులు జారీచేసింది

### భారత్‌లోకి ప్రవేశించే యత్నం..
## చైనా మహిళ అరెస్ట్



భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఓ చైనా మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లాలోని ఇండోనేపాల్ సరిహద్దు వద్ద తచ్చాడుతున్న చైనా మహిళను సశస్త్ర సీమాబల్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద సరైన వీసా, పాస్‌పోర్ట్ పత్రాలు లేకపోవడంతో పోలీసులకు అప్పగించారు. ఆమె దగ్గర లభించిన ఓ స్లిప్ ఆధారంగా మహిళను చైనాకు చెందిన హువాజియా జీగా గుర్తించినట్లు నౌతన్వా స్టేషన్ హౌస్‌ఆఫీసర్ వెల్లడించారు. ఆమె భారత్‌కు ఎందుకు వచ్చిందనే విషయంపై విచారణ కొనసాగుతోందన్నారు.

## ప్రతీకారం మంచిది కాదు కానీ.. అజిత్ డోభాల్ కీలక వ్యాఖ్యలు

దిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ యువతనుద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని వారికి సూచించారు. ప్రతీకారం మంచిది కాదని.. దానిని ప్రేరణ శక్తిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం మన సరిహద్దుల వద్దే కాకుండా.. దేశంపై గతంలో జరిగిన అణచివేతకు ప్రతీకారం తీర్చుకోవాలని అన్నారు. ఇందుకోసం దేశ సైనిక, ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుందన్నారు.



బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల ధీరత్వాన్ని పుణికి పుచ్చుకోవాలన్నారు. చరిత్రలో ఇతర దేశాలు మనపై దాడులు చేసి ఆలయాలు, గ్రామాలను ధ్వంసం చేసినప్పటికీ మన పూర్వీకులు మాత్రం ఏ దేశ ప్రజలకూ ఎటువంటి హాని చేయలేదని అజిత్ డోభాల్ పేర్కొన్నారు. వారి నుంచి పాఠాలు నేర్చుకొని మనం కూడా ఇతరులను ఇబ్బందిపెట్టకుండా ప్రగతిశీల సమాజం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఏ దేశమైనా అభివృద్ధి బాటలో నడవాలంటే సరైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. నాయకత్వం గొప్పదనాన్ని తెలుపుతూ.. "ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు భయపడను.. కానీ సింహం నేతృత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతాను" అని ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ అన్న మాటలను గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కేవలం పదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపిందన్నారు. మరికొన్నేళ్లలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల వరుసలో నిలుస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం వంటి విషయాల్లో ప్రధాని మోదీ నిబద్ధత, కృషి, నాయకత్వ భావాలు, అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

### బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ ఛైర్మన్‌గా
## తారిఖ్ రహ్మాన్


ఢాకా: బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్‌గా తారిఖ్ రహ్మాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనారోగ్య సమస్యలతో ఆ పార్టీ మాజీ ఛైర్‌పర్సన్, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా మరణంతో ఈ పదవి ఖాళీ అయ్యింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన పార్టీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో బీఎన్‌పీ ఛైర్మన్‌గా రహ్మాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ కార్యదర్శి జనరల్ మీర్జా ఫక్రుల్ ఇస్లామ్ అలంగీర్ మీడియాకు వెల్లడించారు. బీఎన్‌పీ ఛైర్మన్‌గా ఎన్నికైన అనంతరం రహ్మాన్ మాట్లాడుతూ.. గత ఏడాది ఆగస్టు 5కు ముందు (హసీనా పాలనా కాలాన్ని ఉద్దేశించి) నాటి రాజకీయ పరిస్థితులు ఉండబోవని, అలాంటి వాతావరణాన్ని దేశం కోరుకోవడం లేదన్నారు. 17 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టిన తారిఖ్ రహ్మాన్.. బంగ్లాదేశ్ ప్రధాని అభ్యర్థి రేసులో ఉన్నారు. ఈ ఏడాది



ఫిబ్రవరిలో జరగబోయే బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని బీఎన్‌పీ అధికారం చేజిక్కించుకోవడంలో ముందువరుసలో ఉంది. ఎన్నికల్లో పోటీ చేయకుండా షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్‌పై నిషేధం విధించిన నేపథ్యంలో బీఎన్‌పీ విజయం నల్లేరుపై నడక కానుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సూసైడ్ నాటకం.. పరుగులు పెట్టిన పోలీసులు..!

గోరఖ్‌పుర్: తన స్నేహితులను ఆటపట్టించాలని ఓ బాలిక సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్ట్.. పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్‌లో చోటుచేసుకుంది. 17 ఏళ్ల బాలిక ఫేస్‌బుక్ లైవ్‌లో ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు పేర్కొంది. ఓ వైపు విషాదకర గేయం ప్లే అవుతుండగా.. మాత్రలు మింగి చనిపోతున్నట్లు ఆమె అందులో పేర్కొంది. 'నేను చనిపోతే.. ఎందుకు చనిపోయానో అడగకండి. దానికి కారణం మీరే ఆలోచించండి' అంటూ స్నేహితులను ఉద్దేశించి రాసుకొచ్చింది. బాలిక ఆత్మహత్యాయత్నంపై మెటా ఏఐ..



గోరఖ్‌పూర్ పోలీసులను అప్రమత్తం చేసింది. దీంతో కాపాడేందుకు ఆమె నివాసానికి వెళ్లిన పోలీసులు ఆమె చెప్పిన సమాధానంతో కంగుతిన్నారు. అదంతా ప్రాంక్ అని చెప్పడంతో నివ్వెరపోయారు. తాను తీసుకున్నది నిజమైన మాత్రలు కావని, చూయింగ్ గమ్ అంటూ వివరణ ఇచ్చింది. తన స్నేహితులను ఆటపట్టించేందుకు ఇదంతా చేసినట్లు పేర్కొంది. దీంతో భవిష్యత్‌లో ఇలాంటి ప్రాంక్‌లు చేయొద్దంటూ హెచ్చరించి వదిలేసినట్లు పోలీసులు తెలిపారు. ఆమె స్వస్థలం బిహార్‌లోని గోపాల్ గంజ్ కాగా.. స్థానికంగా ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తోందని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

### 'గ్రోక్' చాట్‌బాట్‌పై
## ఇండోనేసియా తాత్కాలిక నిషేధం


కృత్రిమ మేధ టూల్స్‌తో రూపొందించే అసభ్యకర, అశ్లీల కంటెంట్ ఆన్‌లైన్‌లో విపరీతంగా పెరిగిపోతుండటంపై భారత్ సహా పలు దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇండోనేసియా కీలక నిర్ణయం తీసుకుంది. గ్రోక్ చాట్‌బాట్ వినియోగంపై తాత్కాలిక నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చర్యలు తీసుకున్న తొలి దేశంగానూ నిలిచింది. డిజిటల్ వేదికలో వస్తోన్న అసభ్యకర కంటెంట్‌ను మానవ హక్కులు, గౌరవం, పౌరుల భద్రతా ఉల్లంఘనగా తమ ప్రభుత్వం చూస్తోందని ఇండోనేసియా మంత్రి మోత్యా హఫీద్ పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు సహా సమాజాన్ని ఇటువంటి కంటెంట్ నుంచి రక్షించేందుకే ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ప్రపంచంలో ముస్లిం జనాభా అధికంగా ఉన్న ఇండోనేసియా ఆన్‌లైన్‌లో అసభ్యకర కంటెంట్ కట్టడికి కఠిన ఆంక్షలు అమలు చేస్తోంది. ఎక్స్‌లోని గ్రోక్ చాట్‌బాట్‌లో అసభ్యకర కంటెంట్‌కు సంబంధించి భారత్ కూడా ఇటీవల తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. అటువంటి కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఎక్స్‌ను ఆదేశించడంతోపాటు తీసుకున్న చర్యలపైనా నివేదిక కోరింది. ఈ మేరకు ఎక్స్ నివేదిక అందించగా.. మరింత సమాచారం కావాలని భారత ప్రభుత్వం ఆదేశించింది. ఇదే సమయంలో గ్రోక్ చాట్‌బాట్‌లో ఇమేజ్ జనరేషన్‌పై పరిమితి విధిస్తున్నామని, కేవలం ప్రీమియమ్ సబ్‌స్క్రైబర్లకు మాత్రమే అందుబాటులో ఉండనున్నట్లు ఎక్స్ ప్రకటించింది.

## కఠిన శిక్ష తప్పదు ఆందోళనకారులకు ఇరాన్ హెచ్చరిక

ఇరాన్‌లో దాదాపు రెండు వారాలుగా కొనసాగుతున్న నిరసనలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. వీటిపై ఉక్కుపాదం మోపుతోన్న అక్కడి ప్రభుత్వం.. ఆందోళనలు విరమించకుంటే తీవ్ర చర్యలు తప్పవని మరోసారి హెచ్చరికలు చేసింది. వీటిల్లో పాల్గొనేవారిని శత్రువుగా పరిగణిస్తామని, మరణశిక్ష అభియోగాలు తప్పవని అటార్నీ జనరల్ మొహ్మద్ మోవాహెది ఆజాద్ హెచ్చరించినట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. దేశంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను ఇరాన్ ప్రభుత్వం ఇటీవల నిలిపివేసింది. దీంతో అక్కడ ఏం జరుగుతుందనే విషయం బాహ్య ప్రపంచానికి తెలియడం కష్టమైంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల్లో ఇప్పటికే 72 మంది ప్రాణాలు కోల్పోగా, 2300 మందిని భద్రత సిబ్బంది కస్టడీలోకి తీసుకున్నట్లు అమెరికా కేంద్రంగా నడిచే మానవ హక్కుల సంఘాలు పేర్కొన్నాయి. అయితే, వాస్తవంగా మృతుల సంఖ్య 200లకు పైగా ఉండవచ్చని పలు అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

**అధ్యక్షుడితో ఆటలొద్దు..!**

ఇరాన్ పౌరులకు అండగా ఉంటామని చెబుతోన్న అమెరికా.. నిరసనకారులపై హింసకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని సుప్రీం లీడర్‌ను హెచ్చరిస్తోంది. అధ్యక్షుడు ట్రంప్‌తో ఆటలాడొద్దని ఈ



మేరకు అమెరికా విదేశాంగశాఖ మంత్రి పేర్కొనడం గమనార్హం. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ మాత్రం ఆందోళనకారులపై అణచివేత కొనసాగుతుందన్నారు. దేశద్రోహానికి పాల్పడేవారు, అభద్రతను సృష్టించేవారు, విదేశీ ఆధిపత్యాన్ని కోరుకునేవారిపై అభియోగాలు నమోదు చేస్తామని ఇరాన్ అటార్నీ జనరల్ స్పష్టం చేశారు. వారికి కఠిన శిక్ష తప్పదన్నారు. ఈ విషయంలో ఎటువంటి దయ చూపించే ప్రసక్తే లేదన్నారు.

# ఎయిర్ టెల్ నుంచి సరికొత్త చవక ప్లాన్

**ఏడాదిపాటు చెల్లుబాటు అయ్యే అపరిమిత కాలింగ్ ప్లాన్**

**ప్లాన్ ధర రూ. 1,849**

**ఇంటర్నెట్ అవసరం లేని వారికి ఉపయోగపడే ప్లాన్**



**న్యూఢిల్లీ:** ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ తన కస్టమర్లకు ఊరటనిచ్చేలా మరో ఆకర్షణీయమైన ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తరచూ రీఛార్జ్ చేయాల్సిన తలనొప్పికి చెక్ పెట్టేలా, తక్కువ బడ్జెట్‌లోనే దీర్ఘకాలిక ప్లాన్‌లపై ఎయిర్‌టెల్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే ఏడాది పొడవునా చెల్లుబాటు అయ్యే, అపరిమిత కాలింగ్ సౌకర్యంతో కూడిన కొత్త ప్లాన్‌ను ప్రవేశపెట్టింది.

ఎయిర్‌టెల్ తాజాగా తన రీఛార్జ్ ప్లాన్ పోర్ట్‌ఫోలియోను పూర్తిగా అప్‌గ్రేడ్ చేసింది. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ వ్యాలిడిటీ కలిగిన ప్లాన్‌లను అందిస్తూ, తరచూ రీఛార్జ్ చేసుకునే ఇబ్బందిని తగ్గిస్తోంది. తక్కువ ధరలో ఏడాది పాటు కాలింగ్ అవసరాలను తీర్చే ప్లాన్ కావాలనుకునే వారికి ఇప్పుడు సరైన ఆప్షన్ లభించింది. ఎయిర్‌టెల్ అందిస్తున్న ఈ ప్రత్యేక ప్లాన్ ధర కేవలం రూ. 1,849 మాత్రమే. ఈ ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ ప్లాన్ నిజంగానే 365 రోజుల పూర్తి వ్యాలిడిటీని అందిస్తుంది. రీఛార్జ్‌పై అధికంగా ఖర్చు చేయకూడదనుకునే వినియోగదారులకు ఇది బెస్ట్ ఆప్షన్‌గా చెప్పొచ్చు.

ఈ ప్లాన్‌లో ప్రధాన ఆకర్షణ ఏమిటంటే, ఏడాది పొడవునా అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత వాయిస్ కాలింగ్ సదుపాయం లభిస్తుంది. అయితే ఇది పూర్తిగా వాయిస్-ఓన్లీ ప్లాన్ కావడంతో ఇందులో మొబైల్ డేటా సౌకర్యం ఉండదని వినియోగదారులు గమనించాలి. ఇంటర్నెట్ అవసరం తక్కువగా ఉండి, కాలింగ్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే వారికి ఈ ప్లాన్ చాలా ఉపయోగకరంగా మారనుంది.

## ఎస్‌బీఐ ఖాతాదారులకు షాక్..

**పెరిగిన ఏటీఎం ఛార్జీలు..**

**ఎస్‌బీఐ ఏటీఎం లావాదేవీల ఛార్జీల పెంపు**

**ఉచిత పరిమితి దాటిన తర్వాత అదనపు భారం**

**నగదు విత్‌డ్రాయల్‌పై రూ. 23, ఇతర లావాదేవీలపై రూ. 11 (జీఎస్టీ అదనం)**

**శాలరీ ఖాతాదారులకు ఉచిత లావాదేవీల సంఖ్యపై పరిమితి**

**కొత్త ఛార్జీలు 2025 డిసెంబర్ 1 నుంచే అమల్లోకి వచ్చినట్టు ప్రకటన**

**న్యూఢిల్లీ:** దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు షాకిచ్చింది. ఏటీఎం లావాదేవీలపై ఛార్జీలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటర్‌ఛేంజ్ రుసుములు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బ్యాంకు తెలిపింది. పెంచిన ఈ కొత్త ఛార్జీలు 2025 డిసెంబర్ 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ మార్పుల ప్రభావం ప్రధానంగా సేవింగ్స్, శాలరీ ఖాతాదారులపై పడనుంది.

సవరించిన నిబంధనల ప్రకారం.. ఎస్‌బీఐ ఖాతాదారులు ఉచిత పరిమితి దాటిన తర్వాత ఇతర బ్యాంకుల ఏటీఎంలలో చేసే నగదు విత్‌డ్రాయల్‌పై ఇకపై రూ. 23తో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఛార్జీ రూ. 21 ( జీఎస్టీ అదనం)గా ఉండేది. అలాగే, బ్యాలెన్స్ చెకింగ్, మినీ స్టేట్‌మెంట్ వంటి నాన్-ఫైనాన్షియల్ లావాదేవీలపై ఛార్జీని రూ. 10 నుంచి రూ. 11కి (జీఎస్టీ అదనం) పెంచారు. సేవింగ్స్ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నెలకు 5 ఉచిత లావాదేవీల పరిమితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ముఖ్యంగా శాలరీ ప్యాకేజీ ఖాతాదారుల విషయంలో ఎస్‌బీఐ కీలక మార్పులు చేసింది. గతంలో వీరికి ఏ ఏటీఎంలోనైనా అపరిమిత ఉచిత లావాదేవీల సౌకర్యం ఉండగా, ఇప్పుడు దానిని నెలకు 10కి పరిమితం చేసింది. ఈ 10 లావాదేవీలు దాటిన తర్వాత చేసే ప్రతి ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్‌కు రూ. 23, నాన్-ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్‌కు రూ. 11 (జీఎస్టీ అదనం) చెల్లించాలి. అయితే, కొన్ని ఖాతాలపై ఈ పెంపు ప్రభావం ఉండదని బ్యాంకు స్పష్టం చేసింది. ఎస్‌బీఐ బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బీఎస్‌బీడీ) ఖాతాల సర్వీస్ ఛార్జీలలో ఎలాంటి మార్పులు లేవు. అలాగే, ఎస్‌బీఐ డెబిట్ కార్డుతో ఎస్‌బీఐ ఏటీఎంలలో చేసే లావాదేవీలపై ఛార్జీలు యథాతథంగా ఉంటాయి. కార్డు లేకుండా చేసే క్యాష్ విత్‌డ్రాయల్స్‌పైనా కొత్త ఛార్జీలు వర్తించవు.

## ఫోన్‌పే నుంచి 'బోల్ట్'..

**ఒక్క క్లిక్ తో వీసా, మాస్టర్‌కార్డ్ చెల్లింపులు!**

**వీసా, మాస్టర్‌కార్డ్ లావాదేవీల కోసం 'బోల్ట్' ఫీచర్‌ను ప్రారంభించిన ఫోన్‌పే**

**డివైస్ టోకెనైజేషన్ ద్వారా సురక్షితమైన, వేగవంతమైన చెల్లింపులు**

**ప్రతిసారీ సీవీవీ నంబర్ ఎంటర్ చేయాల్సి రావడం నుంచి వెసులుబాటు**

**వ్యాపారుల యాప్ లోనే చెల్లింపులు.. లావాదేవీల డ్రాప్-అవుట్స్ తగ్గుదల**




**న్యూఢిల్లీ:** ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే తమ యూజర్ల కోసం ఒక కీలకమైన ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. వీసా, మాస్టర్‌కార్డ్ క్రెడిట్, డెబిట్ కార్డ్ లావాదేవీల కోసం 'ఫోన్‌పే పీజీ బోల్ట్' పేరుతో కొత్త సదుపాయాన్ని శనివారం ప్రారంభించింది. ఈ ఫీచర్ ద్వారా యూజర్లు ఒకే క్లిక్‌తో అత్యంత వేగంగా, సురక్షితంగా చెల్లింపులు పూర్తి చేయవచ్చు.

ఈ కొత్త విధానం 'డివైస్ టోకెనైజేషన్' టెక్నాలజీపై పనిచేస్తుంది. యూజర్లు తమ వీసా లేదా మాస్టర్‌కార్డ్ వివరాలను ఫోన్‌పే యాప్‌లో ఒక్కసారి సేవ్ (టోకెనైజ్) చేస్తే సరిపోతుంది. ఆ తర్వాత ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే ఉన్న ఏ మర్చంట్ యాప్‌లోనైనా మళ్లీ మళ్లీ కార్డ్ వివరాలు ఎంటర్ చేయాల్సిన పనిలేదు. అదే డివైస్ లో చేసే తదుపరి లావాదేవీలకు సీవీవీ నంబర్ కూడా అడగదు. దీంతో చెల్లింపుల ప్రక్రియ చాలా సులభతరం అవుతుంది.

సాధారణంగా ఆన్‌లైన్ చెల్లింపుల సమయంలో యూజర్‌ను వేరే పేజీకి రీడైరెక్ట్ చేస్తుంటారు. 'బోల్ట్' ఫీచర్‌తో ఆ అవసరం ఉండదు. మొత్తం లావాదేవీ మర్చంట్ యాప్‌లోనే పూర్తవుతుంది. ఇది యూజర్‌కు సౌకర్యంగా ఉండటమే కాకుండా, లావాదేవీలు మధ్యలో ఆగిపోయే (డ్రాప్-అవుట్స్) సమస్యను తగ్గిస్తుందని కంపెనీ చెబుతోంది. దీనివల్ల వ్యాపారులకు లావాదేవీల సక్సెస్ రేటు కూడా పెరుగుతుంది.

ఈ సందర్భంగా ఫోన్‌పే మర్చంట్ బిజినెస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ షెకావత్ మాట్లాడుతూ.. "భారతీయులకు డిజిటల్ చెల్లింపులను సులభతరం చేసే మా ప్రయాణంలో 'బోల్ట్' ఫీచర్ ఒక ముఖ్యమైన ముందడుగు. టోకెనైజేషన్ ద్వారా యూజర్లకు వన్-క్లిక్ అనుభవాన్ని అందిస్తున్నాం. ఇది యూజర్ల సౌకర్యాన్ని పెంచడంతో పాటు, మా మర్చంట్ భాగస్వాముల వ్యాపారాభివృద్ధికి కూడా దోహదపడుతుంది" అని వివరించారు.

# నా విధిని ఎవరూ మార్చలేరు

## శుభమన్ గిల్



వడోదర: ఫామ్‌లో లేని బ్యాటర్ శుభమన్ గిల్‌ను టీ20 వరల్డ్‌కప్‌కు ఎంపిక చేయని విషయం తెలిసిందే. అయితే ఆ విషయంలో తన విధిని ఎవరూ మార్చలేరన్నారు. నా నుదుటి మీద ఏది రాసి ఉన్నా, దాన్ని నా నుంచి ఎవరూ తీసుకెళ్లలేరన్నారు. ఆదివారం నుంచి న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడనున్న గిల్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. నేను ఎక్కడ ఉండాలో అక్కడ ఉన్నానని, నా విధిని నానుంచి ఎవ్వరూ తీసుకెళ్లలేరని అన్నారు. ఇండియా తరపున ఇప్పటి వరకు గిలత్ 36 వన్డేలు ఆడారు. దాంట్లో అతను 869 రన్స్ చేశాడు. 28.03 సగటు, 138.59 స్ట్రయిక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడతను. దేశం కోసం ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని ప్లేయర్లు నమ్ముతారని, సెలెక్టర్లు వాళ్ల నిర్ణయం వాళ్లు తీసుకుంటారని, తానెప్పుడూ ఆ సందర్భాన్ని గడిపేస్తానని, జీవితం సింపుల్‌గా మారుతుందన్నారు. అయితే ఏ ఫార్మాట్ కూడా అనుకున్నట్లు ఈజీ కాదు అన్నారు. 2011 నుంచి ఇండియా వన్డే వరల్డ్‌కప్ నెగ్గలేదన్నారు. టీ20 జట్టు ఎంపిక విషయంలో సెలెక్టర్ల నిర్ణయాన్ని గౌరవిస్తానన్నారు.

# అర్ధ శతకంతో మెరిసిన గార్డ్‌నర్..

**రెండొందలు కొట్టిన గుజరాత్..!**

**న్యూఢిల్లీ:** మహిళా ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ రెండో మ్యాచ్‌లోనే రెండొందలు స్కోర్ నమోదైంది. గుజరాత్ జెయింట్స్ కెప్టెన్ అషే గార్డ్‌నర్(65) అర్ధ శతకంతో మెరవగా.. అనుష్క శర్మ(44) యూపీ వారియర్స్ బౌలర్లను ఉతికేసింది. వీరిద్దరూ ఔటయ్యాక టెయిలెండర్లు జార్జియా వరేహం(27 నాటౌట్), భారతి ఫుల్‌మలి(14 నాటౌట్)లు సైతం సిక్సర్లతో చెలరేగారు. దాంతో, నిర్ణీత ఓవర్లలో గుజరాత్ 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది.

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్‌లో భారీ స్కోర్ బాదేసింది గుజరాత్ జెయింట్స్. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న యూపీ వారియర్స్‌కు చుక్కలు చూపించి గుజరాత్ బ్యాటర్లు. ఓపెనర్లు బేత్ మూనీ(13), సోఫీ డెవినె(38)లు ఇచ్చిన శుభారంభాన్ని కెప్టెన్ అషే గార్డ్‌నర్(65), అనుష్క శర్మ(44)లు కొనసాగించారు. అయితే.. పవర్ ప్లేలోనే ఓపెనర్లు ఔట్ కావడంతో గుజరాత్ 55 పరుగులకే రెండు బిగ్ వికెట్లు కోల్పోయింది. అయినా కూడా గార్డ్‌నర్, అనుష్కలు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదీ ద్వయం.

బాదుడే పరమావధిగా పెట్టుకున్న వీరిద్దరూ వరల్డ్‌క్లాస్ బౌలర్లు దీప్తి శర్మ(2-32), ఎకిల్‌స్టోన్‌లను అలవోకగా ఎదుర్కొని.. విధ్వంసక ఆటతో గుజరాత్ స్కోర్ బోర్డును ఉరికించింది. టెయిలెండర్లు జార్జియా వరేహం(27), భారతి ఫుల్‌మాలి(14)లు కూడా బ్యాట్లకు పని చెప్పారు. వరేహం మూడు, భారతి రెండు సిక్సర్లతో విరుచుకుపడ్డారు. దీప్తి వర్మ వేసిన 20 వ ఓవర్లో భారతి వరుసగా రెండు సిక్సర్లు బాదడంతో గుజరాత్ స్కోర్ రెండొందలు దాటింది. టాపార్డర్ మిడిలార్డర్ సమిష్టిగా రాణించగా గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 రన్స్ కొట్టింది.



# జమీమాకు ప్రత్యేక బహుమతి ఇచ్చిన గవాస్కర్..

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ నుంచి టీమ్ ఇండియా మహిళా క్రికెట్ స్టార్ జెమిమా రోడ్రిగ్స్‌కు అరుదైన బహుమతి లభించింది. గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అరుదైన బ్యాట్ ఆకారంలో ఉన్న గిటార్‌ను జెమిమాకు గవాస్కర్ బహుమతిగా ఇచ్చారు. శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ప్రత్యేక బహుమతి ఇచ్చి జెమిమాను ఆశ్చర్యపరిచారు. ఇక ఈ గిటారుతో వీరిద్దరూ పొటోలకు ఫోజులిస్తూ సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. కాగా, గతేడాది జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై సెమీఫైనల్‌లో జెమిమా 127 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టును ఫైనల్‌కు చేర్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో టీమ్ ఇండియా కనుక కప్పు గెలిస్తే.. జెమిమా గిటార్ వాయిస్తుంటే తాను పాట పాడుతానని గవాస్కర్ వాగ్దానం చేశారు. ఇక ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించి కప్పు గెలిచింది. దీంతో అప్పుడు ఇచ్చిన హామీని గవాస్కర్ ఇప్పుడు నెరవేర్చుకున్నారు.



# మలేషియా ఓపెన్
# సెమీస్‌లో ఓడిన పీవీ సింధు


**కౌలాలంపూర్:** హైదరాబాదీ స్టార్ షట్లర్ పీవీ సింధు మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీస్‌లో ఓటమి పాలైంది. చైనా క్రీడాకారిణి వాంగ్ జిహి చేతిలో ఆమె పరాజయాన్ని చవిచూసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ టూ ప్లేయర్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 16-21, 15-21 స్కోరుతో సింధుపై సునాయాస విజయాన్ని నమోదు చేసుకున్నది. చైనీస్ ప్లేయర్ దూకుడు ముందు సింధు తేలిపోయింది. కాలి గాయం కావడం వల్ల గత అక్టోబర్ నుంచి ఆటకు దూరంగా ఉన్న పీవీ సింధు చాలా గ్యాప్ తర్వాత తొలి టోర్నమెంట్ ఆడింది. రెండో గేమ్‌లో 11-6 స్కోరుతో లీడింగ్‌లో ఉన్నా.. ఆ తర్వాత తన పట్టు కోల్పోయింది. సింధు ఓటమితో మలేషియా ఓపెన్ టోర్నీలో ఇండియన్ ప్లేయర్ల స్టోరీ ముగిసింది. వాస్తవానికి సింధు ఈ మ్యాచ్ ఆరంభంలో తన సామర్థ్యానికి తగినట్లు ఆడింది. హార్డ్ హిట్టింగ్ చేసింది. క్రాస్ కోర్టు స్మాష్‌లతో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టింది. ఓ దశలో5-2 తేడాతో తొలి గేమ్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కానీ ఆ తర్వాత వాంగ్ ఊపందుకున్నది.

ఓ దశలో 13-13 పాయింట్లతో తీవ్ర పోటీపడ్డారు. ఇక 15-14 స్కోరు ఉన్నప్పుడు వాంగ్ తన ప్రతాపాన్ని చూపింది. సింధుపై తీవ్ర వత్తిడి తెచ్చింది. ఏకధాటిగా షాట్లతో చెలరేగింది. ఆ జోరుకు పీవీ సింధు చేతులెత్తేసింది. రెండో గేమ్ ఆరంభంలో కూడా సింధు దూకుడుగా ఆడినా.. రెండో హాఫ్‌లో వాంగ్ తన స్ట్రోక్ ప్లేతో ప్రత్యర్థిని చిత్తు చేసింది.



# 12 వస్తోన్న మనశంకరవరప్రసాద్ గారు

## టిక్కెట్ల ధరల పెంపునకు సర్కార్ గ్రీన్ సిగ్నల్



**టాకీస్:** 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో స్పెషల్ ప్రీమియర్‌తో పాటు, టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనవరి 11న స్పెషల్ ప్రీమియర్‌కు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య షోను ప్రదర్శించాల్సి ఉంటుంది. జనవరి 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని తెలుపుతూ జీవో జారీ చేసింది. ఈ చిత్రం టికెట్ ధరలు పెంచుకునేందుకు ఇప్పటికే ఏపీలో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అక్కడ స్పెషల్ ప్రీమియర్ షో టికెట్ ధర రూ.500 కాగా (జీఎస్టీతో కలిపి).. సింగిల్ స్క్రీన్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.125 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశాన్ని ఏపీ ప్రభుత్వం కల్పించింది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్నారు.



# ప్రజల జేబులు కొల్లగొట్టిన రాజాసాబ్




## తొలిరోజే 112 కోట్లు వసూళ్లు

**టాకీస్:** రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందిన హారర్ కామెడీ చిత్రం 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమా మొదటి రోజు వసూళ్లపై చిత్రబృందం తాజాగా స్పందించింది. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. దీంతో ఈ సినిమా తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా రూ. 112 కోట్ల మార్కును దాటేసి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. బాహుబలి 2, సాహో, ఆదిపురుష్, సలార్, మరియు కల్కి చిత్రాల తర్వాత ప్రభాస్ ఖాతాలో చేరిన ఆరో రూ. 100 కోట్ల ఓపెనర్ ఇది. దీంతో ఇండియాలో ఈ ఘనత సాధించిన ఏకైక హీరోగా ప్రభాస్ చరిత్ర సృష్టించారు. తెలుగు రాష్ట్రాల్లో రూ. 58 కోట్ల వసూళ్లను సాధించగా.. కర్ణాటక / ఇతర రాష్ట్రాలలో రూ. 18 కోట్లు, ఓవర్సీస్‌లో రూ.36 కోట్లు రాబట్టినట్లు సమాచారం.

# ఆషిక రంగనాథ్‌కు పెరిగిన ఆఫర్స్

**టాకీస్:** కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన అమిగోస్ అనే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ ఆషిక రంగనాథ్. తొలి సినిమాతోనే తన అందంతో అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ సినిమా విజయం సాదించపోయినా ఈ అమ్మడికి మంచి మార్కులు పడ్డాయి. ఆతర్వాత కింగ్ నాగార్జునతో నా సామిరంగ సినిమాలో నటించింది. ఈ సినిమాలో తన నటనతో కట్టిపడేసింది ఆషిక రంగనాథ్. ఈ సినిమా ఓ మోస్తరు విజయం సాధించింది. ఆతర్వాత ఆషిక రంగనాథ్‌కు ఆఫర్స్ పెరిగాయి. ప్రస్తుతం ఈ అమ్మడు వరుస అవకాశాలతో దూసుకు పోతుంది. ఈ క్రమంలోనే మాస్ మహారాజ రవితేజ నటిస్తున్న భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, సాంగ్స్ , టీజర్ సినిమాపై అంచనాలను పెంచేయి. అలాగే రీసెంట్ గా వచ్చిన ట్రైలర్ సినిమా పై భారీ హైప్ క్రియేట్ చేసింది. ఈ సినిమాలో ఆషిక రంగనాథ్ గ్లామరస్ రోల్ లో కనిపించనుందని తెలుస్తుంది. ఈ సినిమాపై ఆషిక రంగనాథ్ భారీ ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాతో పాటు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమాలోనూ నటిస్తుంది. ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. కాగా సోషల్ మీడియాలోనూ ఈ చిన్నది క్రేజీ ఫోటోలను పంచు కుంటుంది.

# సంక్రాంతికి అమెజాన్‌లో దండోరా రిలీజ్

**టాకీస్:** తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన 'దండోరా' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమాపై, విడుదలకి ముందు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. అయితే థియేటర్లలో అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం జనవరి 14 నుంచి తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు




తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించగా.. మురళీకాంత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తెలంగాణలోని తుళ్లూరు అనే గ్రామం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరిలో కుల వివక్ష వేళ్లూనుకుపోయి ఉంటుంది. ఎంతలా అంటే, తక్కువ కులానికి చెందిన వారు మరణిస్తే వారి అంత్యక్రియలు కూడా ఊరికి దూరంగా, ఎవరికీ కనిపించని చోట నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అగ్ర కులానికి చెందిన రైతు శివాజీ (శివాజీ) హఠాత్తుగా మరణిస్తాడు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి వీల్లేదని ఆ కుల పెద్దలు అడ్డుతగులుతారు. దీంతో తన తండ్రికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలని కొడుకు విష్ణు (నందు), కూతురు సుజాత (మనికా చిక్కాల), ఊరి సర్పంచ్ (నవదీప్) కలిసి పోరాటం మొదలుపెడతారు. అయితే సొంత కులమే శివాజీని ఎందుకు వెలివేసింది? తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు, ఈ కుల రాజకీయాలకు సంబంధం ఏంటి? వేశ్య శ్రీలత (బిందుమాధవి) పాత్ర శివాజీ జీవితాన్ని ఎలా మార్చింది? చివరికి శివాజీ అంత్యక్రియలు సజావుగా సాగాయా లేదా? అనేదే మిగతా కథ.

# నేను డాక్టర్‌ని.. సిస్టర్‌ను కాను

## విలేకరికి శ్రీలీల ఫన్నీ రిప్లై

**టాకీస్:** టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల ప్రస్తుతం తన కోలీవుడ్ డెబ్యూ మూవీ 'పరాశక్తి' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ సరసన ఆమె నటించిన ఈ చిత్రం శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం కేరళలోని కొచ్చికి శ్రీలీల వెళ్లగా.. అక్కడ జరిగిన ప్రెస్ మీట్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. సినిమా ప్రమోషన్స్ సందర్భంగా ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను ఫ్లర్ట్ చేస్తూ సరదాగా అడిగిన ప్రశ్నలు, దానికి ఆమె ఇచ్చిన క్యూట్ రియాక్షన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను పలకరిస్తూ మీకు తమిళం వచ్చా అని అడగగా, ఆమె అవును వచ్చు అని సమాధానమిస్తుంది. అనంతరం ఆ రిపోర్టర్ శ్రీలీల అందాన్ని పొగుడుతూ.. మిమ్మల్ని మొదటిసారి నేరుగా చూస్తున్నాను, మీరు చాలా అందంగా ఉన్నారు అని చెప్పడంతో ఆమె ఒక్కసారిగా సిగ్గుపడుతూ నవ్వేశారు. అయితే వెంటనే ఆ రిపోర్టర్ ట్విస్ట్ ఇస్తూ.. మీరు నాకు ఒక సిస్టర్ లాగా అనిపిస్తున్నారు అని అనడంతో, శ్రీలీల తనదైన శైలిలో.. తాను మెడికల్ స్టూడెంట్ అన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. నేను డాక్టర్‌ను, సిస్టర్‌ను (నర్సును) కాదు అంటూ చమత్కరించారు. శ్రీలీల ఇచ్చిన ఈ ఫన్నీ కౌంటర్‌తో అక్కడ నవ్వులు పూశాయి. ప్రస్తుతం ఈ క్యూట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.